ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 200 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 27 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



ఆ నిర్ణయాలు ఏకపక్షం కాదు

ముగ్గురు సభ్యులు కలసి తీసుకున్నవే

ఫైళ్ల పరిశీలనలో చేసిన సూచనలు, ప్రశ్నలను పరిగణించరాదు

ఎస్ ఐ ఆర్, సీఈసీ పనితీరుపై సుప్రీంకోర్టు అఫిడవిట్

పరిశీలన తర్వాత అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరు, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దాఖలైన పిటిషన్లకు సంబంధించి భారత ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఈ పిటిషన్ ప్రధానంగా ఒక వార్తా కథనంపై ఆధారపడి ఉందని పేర్కొంది. సీఈసీని విధుల నుంచి తప్పించాలన్న లేదా ఆయన పనితీరుపై ఆంక్షలు విధించాలన్న అభ్యర్థనలను వ్యతిరేకించింది. ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన మూడు కీలక ఉత్తర్వులు కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయని స్పష్టం చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఆమోదంతోనే అఫిడవిట్ దాఖలైనట్లు పేర్కొంది. ఫైళ్ల పరిశీలన సమయంలో వ్యక్తిగతంగా అధికారులు లేదా కమిషనర్లు చేసే వ్యాఖ్యలు, సూచనలు, ప్రశ్నలను కమిషన్ తుది నిర్ణయాలుగా పరిగణించకూడదని వివరించింది. సాధారణంగా ఫైల్ ఒక ఎన్నికల కమిషనర్ నుంచి మరొకరికి, ఆ తర్వాత సీఈసీ వద్దకు వెళ్తుందని తెలిపింది.

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!

మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం

రెండు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడే వారధిగా చూడాలని విజ్ఞప్తి

ముంబై అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముంబయిలో చర్చలు జరిగాయి. 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం తెలపాలని సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రను కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి

రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో

..మిగతా 2లో

రూ. 2.12 లక్షల కోట్లతో డ్రోన్లు..గన్లు

హెలికాప్టర్లు, మెబిలిటీ వహనాలు... రక్షణశాఖకు పరికరాలు కొనుగోలు

ఆయుధాలు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్.. స్వాగతించిన కాంగ్రెస్ పార్టీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, లాంగ్-రేంజ్ కామికాజ్ డ్రోన్ల సహా సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డ్‌గన్ సిస్టమ్, , గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్ తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, వెరీ షార్ట్-రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (అతి తక్కువ దూరంలోని వైమానిక దాడులను అడ్డుకొనే వ్యవస్థ , కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (డ్రోన్ నిరోధక వ్యవస్థ కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర డ్రోన్ వ్యవస్థలు, మానవ రహిత నిఘా వైమానిక వ్యవస్థలు, 'సమన్వయ, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు', దీర్ఘశ్రేణి కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.



'క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'

రాహుల్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, ఆ తీర్పును స్వాగతిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది హస్తం పార్టీ. పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. డప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు. కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది.

దేశ భద్రతపై జాతీయ సదస్సు

తిరుపతి వేదికగా డిసెంబర్ 4 నుంచి నిర్వహణ

ప్రధాని మోడీ, అమిత్ షా తో పాటుగా డీజీపీలు, ఐజీలు హాజరు

తిరుపతి అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



తిరుపతి మరో ప్రతిష్టాత్మక సదస్సుకు వేదిక కానుంది. డిసెంబరు 4 నుంచి 6 వరకు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. ఈ సదస్సుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఏపీ సీఎస్ జి. సాయి ప్రసాద్ ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ ఈ సమావేశం మొదటి రెండు రోజులు పాల్గొనే అవకాశం ఉన్నందున, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యున్నత స్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. మూడు రోజుల కాన్ఫెరెన్స్‌కు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 200 మందికి పైగా ఐపీఎస్ అధికారులు, దాదాపు 200 మంది ఐబీ అధికారులు, జాతీయ భద్రతా సలహాదారు, కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర, కేంద్ర బలగాల ప్రతినిధులు హాజరుకానున్నారు. తిరుపతి నగరమంతా ముమ్మరంగా సుందరీకరణ పనులు చేపట్టాలని సీఎస్ సూచించారు. సదస్సు జరిగే ప్రదేశంలో ఎలాంటి నెట్‌వర్క్ అంతరాయం లేకుండా ప్రత్యేక ఐటీ టవర్లను ఏర్పాటు చేయాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్త మాట్లాడుతూ.. ఏర్పాట్ల పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని సీఎస్‌ను కోరారు.

సర్వీస్ అపార్ట్‌మెంట్లలో 'సీక్రెట్' దందా!

అక్రమంగా వచ్చిన విదేశీ మహిళలకు ఆశ్రయమిస్తే చర్యలు తప్పవు!

మాదాపూర్‌లో పోలీసుల దాడి.. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలు అదుపులోకి

ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడి.. 'నాయక్' కోసం గాలింపు

శేరిలింగంపల్లి : అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



సర్వీస్ అపార్ట్‌మెంట్లు, గెస్ట్‌హౌస్‌లను అడ్డాగా చేసుకుని సాగుతున్నట్లు అనుమానిస్తున్న అక్రమ కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెంచారు. అనుమానాస్పద వసతి కేంద్రాలపై తనిఖీలు ముమ్మరం చేస్తూ, సరైన గుర్తింపు పత్రాలు లేకుండా విదేశీయులకు ఆశ్రయం కల్పించే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో చందానాయక్ తండాలోని ఓరియంట్ ఎలిగెంట్స్ అపార్ట్‌మెంట్‌లో ఎస్ఓటీ, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలు పట్టుబడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానాయక్ తండాలోని ఓరియంట్ ఎలిగెంట్స్ అపార్ట్‌మెంట్ ప్లాట్ నంబర్ 201లో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు ఉజ్బెకిస్థాన్‌కు చెందినవారని గుర్తించినట్లు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు. వారు నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, వారి పాస్‌పోర్టులు, వీసాలు, ఇతర ప్రయాణ పత్రాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

'నాయక్' పాత్రపై ఆరా..


గత నెలలో ముగ్గురు మహిళలను ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి, 'నాయక్' అనే వ్యక్తి వారి ద్వారా వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైందద సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను

..మిగతా 2లో

ఆకలి తీర్చే ఆహారంలో కల్తీ విషం!



హోటల్స్ లో తనిఖ చేస్తున్న అధికారులు



మాదాపూర్ లోని హోటల్ బిర్యాని లో వచ్చిన మనిషి వన్న



రుచుల మాటున రసాయనాల ముప్పు.. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

రోడ్డు పక్కన హోటల్ నుంచి స్టార్ హోటల్ వరకు తనిఖీలు ఏవి? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి!

శేరిలింగంపల్లి : అక్టోబర్ 26, (ప్రభాత ఉదయం)

ఆకలి తీర్చాల్సిన ఆహారమే అనారోగ్యానికి కారణమైతే సామాన్యుడి పరిస్థితి ఏమిటి? తక్కువ ధరకు కడుపు నింపుకోవాలన్నా రుచికరమైన భోజనం ఆస్వాదించాలన్నా హోటళ్లను ఆశ్రయిస్తున్న ప్రజలకు సురక్షితమైన ఆహారం అందుతోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఆహార పదార్థాల్లో కల్తీ, అనుమతులు లేని రంగులు, నిబంధనలకు విరుద్ధంగా రసాయనాల వినియోగం, అపరిశుభ్రమైన వంటశాలలు, నాణ్యత లేని ముడి పదార్థాల వాడకం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉంది. హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో చిన్న హోటళ్ల నుంచి పెద్ద రెస్టారెంట్లు, స్టార్ హోటళ్ల వరకు ఆహార భద్రత ప్రమాణాల అమలుపై నిరంతర పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రుచికోసం రసాయనాలా?

ఆహారాన్ని ఆకర్షణీయంగా చూపించేందుకు, రుచిని పెంచేందుకు, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు కొన్ని పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించే అవకాశం ఉండటంపై ఆందోళనలు ఉన్నాయి. ముఖ్యంగా అనుమతిలేని రంగులు, నిషేధిత పదార్థాలు, నాసిరకం ముడి సరుకులు, కలుషితమైన నీరు, పదేపదే వినియోగించే వంటనూనె వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలి. అయితే ప్రతి రంగు లేదా రసాయనం హానికరమని భావించడం సరికాదు. అనుమతించిన పదార్థాలను నిర్దేశిత పరిమితుల్లో వినియోగించాలి. నిషేధిత పదార్థాలు, అధిక మోతాదులు, కలుషిత ఆహారం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆహార కాలుష్యం వల్ల వాంతులు, విరేచనాలు, ఆహార విషబాధ వంటి తక్షణ సమస్యలు రావచ్చు. కొన్ని కలుషితాలు, విషపూరిత పదార్థాలకు దీర్ఘకాలం గురికావడం వల్ల కాలేయం, మూత్రపిండాలు తదితర అవయవాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. కొన్ని నిర్దిష్ట రసాయనాలు, కలుషితాలు క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉంటాయని శాస్త్రీయ ఆధారాలు సూచిస్తున్నాయి. అయితే నగరంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుదలకు ఆహార కల్తీ ఒక్కటే కారణమని వైద్యులు నొక్కి చెప్తున్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించకుండా, శాస్త్రీయ పరీక్షలు, వైద్య పరిశోధనల ఆధారంగా వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

పరిశుభ్రతకు తిలోదకాలిస్తే అనారోగ్యమే!

కొన్ని ఆహార విక్రయ కేంద్రాల్లో వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, ముడి సరుకుల నాణ్యత, తాగునీటి భద్రత వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. వండిన ఆహారాన్ని ఎక్కువసేపు సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయకపోవడం, పచ్చి పదార్థాలు వండిన ఆహారాన్ని కలిపి ఉంచడం, చేతులు శుభ్రం చేసుకోకుండా వంట చేయడం, ఈగలు, ఇతర కీటకాలు చేరే పరిస్థితులు ఉండటం వల్ల ఆహారం కలుషితమయ్యే అవకాశం ఉంది. ఆకలితో హోటల్‌కు వెళ్లే వినియోగదారుడు వంటశాలలో ఏం జరుగుతుందో తెలుసుకోలేడు. ప్లేటులో వడ్డించిన ఆహారం చూడటానికి బాగున్నా, దాని తయారీ విధానం, ముడి పదార్థాల నాణ్యత, నిల్వ పరిస్థితులు తెలియవు. అందువల్ల ఆహారం రుచిగా ఉందా లేదా అన్నదానికంటే అది సురక్షితంగా తయారైందా లేదా అన్నది కీలకం. పరిశుభ్రతను కేవలం ప్రదర్శనకే పరిమితం చేయకుండా, వంటశాల నుంచి వినియోగదారుడి టేబుల్ వరకు ప్రతి దశలోనూ పాటించాల్సి ఉంది.

రోడ్డు పక్కన బండి హోటల్ నుంచి స్టార్ హోటల్ వరకు తనిఖీలు!

ఆహార భద్రత అనేది చిన్న వ్యాపారులకు మాత్రమే వర్తించే నిబంధన కాదు. వీధి ఆహార విక్రయ కేంద్రాలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, కార్యాలయ క్యాంటీన్లు, పెద్ద హోటళ్లు అన్నింటిలోనూ వర్తించే నిబంధనలను అమలు చేయాలి. వ్యాపార సంస్థ పరిమాణం, ప్రాచుర్యం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రమాద స్థాయికి అనుగుణంగా అధికారులు తనిఖీలు నిర్వహించేయాలి. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ ఎస్ఏఐ) నిబంధనల ప్రకారం అవసరమైన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నిల్వ విధానాలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలి. అనుమానం ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు, లైసెన్సు సంబంధిత చర్యలు, అవసరమైన సందర్భాల్లో న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి. తనిఖీలు నిర్వహించినట్లు ప్రకటనలు ఇవ్వడం మాత్రమే కాకుండా, వాటి ఫలితాలు ఏమిటి? ఎన్ని నమూనాలు సేకరించారు? ఎన్ని పరీక్షల్లో నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. శేరిలింగంపల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో తనిఖీల స్థితిగతులపై అధికారిక సమాచారం అందుబాటులో ఉంటే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పనిసరి

ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాలు ఆర్జించాలనుకునే వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాలి. ఉద్దేశపూర్వకంగా కల్తీకి పాల్పడటం, నిషేధిత పదార్థాలు వినియోగించడం, నాణ్యత లేని ఆహారాన్ని విక్రయించడం వంటి ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో తనిఖీల్లో నిజాయితీ, పారదర్శకత పాటిస్తూ చిన్న వ్యాపారులకు కూడా పరిశుభ్రత, ఆహార నిల్వ, సురక్షిత తయారీ పద్ధతులపై అవగాహన కల్పించాలి. ప్రజలు కూడా అనుమానాస్పద ఆహార పదార్థాలు, అపరిశుభ్రమైన వంటశాలలు, ఆహారం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి.

ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం కావాలి

హైటెక్ సిటీ పరిసరాల్లో పనిచేసే ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు సహా వేలాది మంది రోజువారీ ఆహారం కోసం హోటళ్లపై ఆధారపడుతున్నారు. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారాన్ని ప్రయోగశాలలో పరీక్షించుకోవడం సాధ్యం కాదు. అందుకే ఆ బాధ్యతలో ఆహార వ్యాపారులతో పాటు ప్రభుత్వ పర్యవేక్షణ వ్యవస్థకూ కీలక పాత్ర పోషించవల్సిన అవసరం ఎంతైన ఉంది. ఆహార కల్తీపై అవగాహన, క్రమబద్ధమైన తనిఖీలు, ప్రయోగశాల పరీక్షలు, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, ఉల్లంఘనలకు చట్టబద్ధమైన శిక్షలు అమలులోకి వస్తేనే ప్రజలకు భరోసా కలుగుతుంది. ఆకలి తీర్చే ఆహారం అనారోగ్యానికి కారణం కాకుండా చూడటం సమాజం మొత్తం బాధ్యత. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరించాలి.. ఆహార భద్రత పర్యవేక్షణ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక దిగుబడులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం):

కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో సోమవారం ఖేత్ బచావో అభియాన్--2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టీఆర్‌వీకే శాస్త్రవేత్త మధుకర్ రావు మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరిసాగుకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలతో పాటు పొద్దుతిరుగుడు, వేరుశనగ, ఆముదం, నువ్వులు వంటి నూనెగింజలు, సజ్జ, కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలను అనుకూలమైన నేలలు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపికతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. భూమిని నిస్సారంగా మార్చకుండా, భూసారాన్ని కాపాడుతూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాలని రైతులకు పిలుపునిచ్చారు.హెచ్.ఓ స్వాతి మాట్లాడుతూ, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలంటే వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు, ఆయిల్‌పామ్‌సాగును సాగు చేయాలని సూచించారు. కోతుల బెడదను దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పామ్‌సాగుపై ఆసక్తి చూపవచ్చని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, నారు, బిందు సేద్యం, స్ప్రింక్లర్‌పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సత్యం, ఉపసర్పంచ్ కూకట్ల రమేష్, ఏఈఓ సంపత్, పి.ఎస్ శ్రావణి, ఏటీఎం అనూష, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'గీతం' పెద్దపీట

మూడు ప్రత్యేక విభాగాలతో కెరీర్ సేవలు బలోపేతం

మారిన సాంకేతికతకు అనుగుణంగా పరిశ్రమ స్థాయి శిక్షణ

టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ వెల్లడి

పటాన్ చెరు, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం):

మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేసేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తమ నైపుణ్యాభివృద్ధి, కెరీర్ సేవా విభాగాలను మరింత బలోపేతం చేసింది. వర్సిటీ పరిధిలోని 'గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్' (జీసీజీసీ) ఆధ్వర్యంలో శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి సలహాల (టీఎంసీజీ) సేవలను పునర్వ్యవస్థీకరించి, మూడు ప్రత్యేక విభాగాల ద్వారా సమగ్ర సహాయాన్ని అందిస్తున్నట్లు టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ తెలిపారు. విద్యార్థుల విద్యా, వృత్తి జీవితంలో ప్రతి దశలోనూ వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యంగా మూడు క్యాంపస్ లలో ప్రత్యేక సమన్వయకర్త లను నియమించినట్లు ఆమె పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కంపెనీ ఆధారిత శిక్షణ, గ్లోబల్ సర్టిఫికేషన్లు, ఏఐ ఆధారిత ప్రాక్టీస్ ప్లాట్‌ఫారమ్‌లు, క్రెడిట్ కోర్సులు, కోక్యూబ్స్, సీటీ3 అసెస్‌మెంట్లు , హ్యాకథాన్‌ల ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థుల బలాలు, అభిరుచులను గుర్తించి, వారి లక్ష్యాలకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేందుకు అధ్యాపకులు, రంగ నిపుణుల ద్వారా వ్యక్తిగతీకరించిన కెరీర్ ప్రణాళికలను రూపొందిస్తుందని పేర్కొన్నారు. సాధారణ ప్రాంగణ నియామకాలకే పరిమితం కాకుండా విదేశీ విద్య, గేట్, క్యాట్, ఐఐటీ జామ్, జీపాట్, నీట్ వంటి పోటీ పరీక్షలతో పాటు సివిల్ సర్వీసెస్, రక్షణ రంగం, ఇతర ప్రభుత్వ కొలువులకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక మార్గదర్శకత్వం కల్పిస్తుందని తెలిపారు.

సమన్వయకర్తల నియామకంచ

ఈ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు డాక్టర్ రోజీనా వెల్లడించారు. టీసీడీ విభాగానికి అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఆర్. సంపత్ కుమార్, ఎ.ఎస్. పద్మజ, అసిస్టెంట్ మేనేజర్‌గా జి. విష్ణుప్రియ బాధ్యతలు చేపట్టారు. సీసీఎం విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి. సరిత, డిప్యూటీ మేనేజర్‌గా రంజనా ఫెర్నాండో నాయకత్వం వహిస్తారు. ప్రత్యామ్నాయ కెరీర్ సేవల విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ బి. రవికాంత్ వ్యవహరిస్తారు. కేంద్ర బృందంతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉండేలా మూడు ప్రాంగణాలలో క్యాంపస్ స్థాయి ప్రతినిధులను నియమించినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ప్రతిభగల క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం







క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి అవసరం. .. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

ఘనంగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం):

ప్రతిభగల క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ మైదానంలో 70వ రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలుర క్రికెట్ టోర్నమెంట్ ను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, స్వయంగా కలెక్టర్ కాసేపు సరదాగా బ్యాటింగ్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలకు చెందిన 10 జట్లు గద్వాలకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో సత్సంబంధాలు ఏర్పడడమే కాక క్రీడా స్ఫూర్తితో మెలిగేందుకు వివిధ ఆటలుదోహదపడతాయన్నారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఇక్కడ ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి డిసెంబర్ రెండో వారంలో గ్వాలియర్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ స్టేడియంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో క్రీడల రాష్ట్ర పరిశీలకులు దేవిడ్, ఇన్చార్జి డిఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, స్టేడియం ఇన్చార్జి బషీర్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ అపార్ట్‌మెంట్లలో 'సీక్రెట్' దందా!

మొదటి పేజీ తరువాయి...

కేంద్రంగా చేసుకుని ఈ వ్యవహారం సాగిందా? మహిళలను నగరానికి తీసుకొచ్చింది ఎవరు? వారికి వసతి కల్పించినవారెవరు? ఈ వ్యవహారంలో ఇతర మధ్యవర్తుల పాత్ర ఏమైనా ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న 'నాయక్' అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు. అతడిని పట్టుకుని విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. మరోవైపు అదుపులోకి తీసుకున్న మహిళల ప్రయాణ వివరాలు, అపార్ట్‌మెంట్ బుకింగ్, నిర్వాహకులతో సంబంధాలపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక

సర్వీస్ అపార్ట్‌మెంట్లు, గెస్ట్‌హౌస్‌లు, అద్దె గదుల నిర్వాహకులు వసతి కోరేవారి గుర్తింపు, చిరునామా, పాస్‌పోర్టు, వీసా తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే గదులు కేటాయించాలని పోలీసులు సూచించారు. నిబంధనలు పాటించకుండా అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు.

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!

మొదటి పేజీ తరువాయి...

వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు.

ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు.

ట్రిబుల్ ఐటీ జంక్షన్ ట్రాఫిక్ కష్టాలు.. మరో మూడు నెలలు తప్పనిసరి

డీఎల్ఎఫ్ గేట్ 1 నుంచి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు రహదారి మూసివేత

ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులతో వాహనదారులకు ఇబ్బందులు.. ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసుల సూచన

శేరిలింగంపల్లి : అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

ఐటీ కారిడార్‌లో కీలకమైన ట్రిబుల్ ఐటి జంక్షన్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి. ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు డీఎల్ఎఫ్ గేట్ 1 నుంచి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రహదారిని అక్టోబర్ 27 నుంచి మరో మూడు నెలల పాటు మూసివేయాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. దీంతో ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ఐటీ ఉద్యోగులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలు

రాడిసన్ హోటల్ నుంచి ట్రిబుల్ ఐటీ జంక్షన్‌కు వెళ్లేవారు డీఎల్ఎఫ్ గేట్ 1 వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. అక్కడి నుంచి ముందుకు వెళ్లేందుకు అనుమతి ఉండదు. వాహనదారులు గచ్చిబౌలి జంక్షన్ వద్ద కుడివైపు మలుపు తీసుకొని ఇందిరానగర్ మీదుగా ఐఐఐటీ జంక్షన్‌కు చేరుకోవాలి. టీసీఎస్ పాత (సీఎంసీ) గేట్ ద్వారా రాకపోకలు సాగించే ఉద్యోగులకు యథావిధిగా ప్రవేశం, నిష్క్రమణకు అనుమతి ఉంటుంది.

లింగంపల్లి వైపు నుంచి డీఎల్ఎఫ్ వెళ్లేవారు: గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను మళ్లిస్తారు. అక్కడి నుంచి ట్రిబుల్ ఐటీ జంక్షన్ మీదుగా గచ్చిబౌలి జంక్షన్ వద్ద ఎడమవైపు, రాడిసన్ జంక్షన్ వద్ద మరోసారి ఎడమవైపు మలుపు తీసుకొని డీఎల్ఎఫ్‌కు చేరుకోవాలి.



సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్..

ఏడాది పాటు నిర్మాణ పనులు జరిగే అవకాశం


ఐఐఐటీ జంక్షన్ వద్ద బహుళ అంతస్తుల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కనీసం ఏడాది పాటు కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. నిర్మాణ పనుల పురోగతి, రహదారి స్థల లభ్యతను బట్టి దశలవారీగా కొంతమేర రహదారిని ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకురానున్నారు.

వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ((ట్రాఫిక్), సైబరాబాద్ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించి, సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఓటు విలువైనది-డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి : కొలన్ సుభాష్ రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 26 (ప్రభాత ఉదయం) :

ఓటు హక్కు చాలా విలువైనదని డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు చేసుకొని పట్టబద్దుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి కోరారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని ప్రేమావతి పేట్, హైదర్ గూడ, ఉప్పర్ పల్లి ప్రాంతాలలో డిగ్రీ పాసైన వారి ని కలసి పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటరు గా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను అందచేశారు. మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచనల మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రులకు ఫామ్-18 అందించి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరూ ఫామ్-18 ద్వారా తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకుని ఓటు వేసినవారు కూడా తాజా ప్రక్రియలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.తమకు తెలిసిన పట్టభద్రులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు



డిగ్రీ పాసైన వారి చేత పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు గా నమోదు చేసుకోవాలని దరఖాస్తులను అందచేసి అవగాహన కల్పిస్తున్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి

భిన్నమైనవని,విద్యావంతులు,మేధావులు,ఉద్యోగులు,యువత తమ రాజకీయ అవగాహనతో ఓటు వేసే ఎన్నికలని అన్నారు.విద్యావంతుల ఆలోచనా విధానం,రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వారి అభిప్రాయాలు ఈ ఎన్నికల్లో ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.కాలక్రమేణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు.అర్హత కలిగిన కొత్త పట్టభద్రులను గుర్తించి వారు ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.ఓటరు నమోదు చేయించడంతోనే బాధ్యత పూర్తికాదని,డ్రాప్ట్ ఓటరు జాబితాలో సంబంధిత ఓటరు పేరు నమోదైందో లేదో కూడా పరిశీలించాలని అన్నారు.అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేకపోతే నిబంధనల ప్రకారం సంబంధిత ఫారమ్ ద్వారా అభ్యంతరం లేదా పిటిషన్ దాఖలు చేసి పేరు నమోదు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన సుభాష్ రెడ్డి యువతకు ఆశించిన స్థాయిలో అవకాశాలు లభించడం లేదని అన్నారు.ప్రభుత్వ హామీలు,ఉద్యోగాలు,అభివృద్ధి,సాగునీరు,రైతుల సమస్యల విషయంలో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ ఎన్నికలను కేవలం పట్టభద్రుల ఓట్ల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా తెలంగాణ రాజకీయ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించే ప్రక్రియగా భావించి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జె.చిత్తారి,ముఖేష్ భంగి శ్రీను, రాము యాదవ్,ఎం.ప్రీతం కుమార్, పి.నరేందర్ రెడ్డి,రవి, కె.హరినాథ్,కొలన్ మదన్ పాల్ రెడ్డి,ఎ.కృష్ణారావు,శ్రీవర్ధన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపూర్ 8వ బెటాలియన్ రక్తదానం చేస్తున్న పోలీసులు...

రక్తదానంతో ప్రాణదానం.. పోలీసు అమరవీరులకు ఘన నివాళి!

8వ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం.. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన అధికారులు, సిబ్బంది

శేరిలింగంపల్లి : అక్టోబర్ 26, (ప్రభాత ఉదయం)

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే మానవతా సంకల్పంతో కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. బెటాలియన్ కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు, అడిషనల్ కమాండెంట్ ఎం. జయరాజు ఆధ్వర్యంలో కొండాపూర్ కిమ్స్, గచ్చిబౌలి ఒమేగా ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. జయరాజు మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం అత్యంత విలువైన మానవతా సేవ అని, ప్రమాదాల్లో గాయపడినవారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ఇతర అత్యవసర వైద్య అవసరాలున్నవారికి సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పోలీసు శాఖలోని సేవాభావం, మానవతా దృక్పథం, సామాజిక బాధ్యత ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. రక్తదానానికి ముందుకొచ్చిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది రక్తదాన ప్రక్రియను వైద్య ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించి అవసరమైన సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి. సత్యనారాయణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, కిమ్స్, ఒమేగా ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస నేరాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు.. చివరకు పీడీ యాక్ట్!

ఆస్తి నేరాల నిందితుడిపై పీడీ చట్టం ప్రయోగం

2008 నుంచి 2026 వరకు 64 కేసుల్లో నిందితుడిగా ఉన్న రవి.. చెర్లపల్లి జైలుకు తరలింపు

శేరిలింగంపల్లి : అక్టోబర్ 26, (ప్రభాత ఉదయం)



సైబరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసిన నిందితుడు రవి..

ఆస్తి నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడనే ఆరోపణలతో ఓ వ్యక్తిపై సైబరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. సూరారం కాలనీకి చెందిన దేరంగుల రవి అలియాస్ గజ దొంగ అలియాస్ డాన్ రవిపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఈ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నేరాలకు పాల్పడకుండా నిరోధించాలనే ఉద్దేశంతో అతడిని మేడ్చల్ జిల్లా చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

దొంగతనాలు, దోపిడీలు, దాడుల ఆరోపణలు

పోలీసుల వివరాల ప్రకారం.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రవి నేరాలకు పాల్పడేవాడు. ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లోని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగ తనాలకు పాల్పడుతున్నాడని పోలీసులు తెలిపారు. వ్యక్తులను బెదిరించి విలువైన వస్తువులను బలవంతంగా లాక్కోవడం, ఇళ్లలో చోరీలు చేయడం, అడ్డువచ్చిన వారిపై కత్తులు, ఇతర మారణాయుధాలతో దాడులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, ప్రధాన ద్వారాలను బలవంతంగా తెరిచి బంగారు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను అపహరించేవాడని వివరించారు. పార్క్ చేసి ద్విచక్ర వాహనాలను సైతం దొంగిలించివాడని తెలిపారు.

18 ఏళ్ల లో 64 కేసులు

2008 నుంచి 2026 వరకు రవిపై మొత్తం 64 క్రిమినల్ కేసులు నమోదైనట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. సూరారం పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించగా, తాజాగా పీడీ యాక్ట్ కింద నిర్బంధించినట్లు తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేర కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



విజిలెన్స్ అవగాహన కార్యక్రమం లో పాల్గొన్న జాతీయ చిరు ధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి

రాజేంద్రనగర్‌లోని జాతీయ చిరు ధాన్యాల పరిశోధనా సంస్థలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం

రాజేంద్రనగర్, అక్టోబరు 26 (ప్రభాత ఉదయం) :

సుపరిపాలన, జవాబుదారి తనంతో ప్రతి ఒక్కరు పని చేయాలని రాజేంద్రనగర్ లోని జాతీయ చిరు ధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐ ఐ ఎం ఆర్) లో సోమవారం విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా డాక్టర్ సీ తారా సత్యవతి మాట్లాడుతూ, సంస్థ లో పని చేస్తున్న ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు పాల్గొన్నారు.



విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో పాల్గొన్న జాతీయ వరి పరిశోధన సంస్థ అధికారులు

ఐసీఏఆర్--ఐఐఆర్ఆర్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవం

రాజేంద్రనగర్, అక్టోబరు 26 (ప్రభాత ఉదయం) :

రాజేంద్రనగర్‌లో ఉన్న భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్--ఐఐఆర్ఆర్)లో అక్టోబర్ 26 నుంచి 30వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సంస్థ సంచాలకులు డా. ఎం. శ్రీనివాస్ ప్రసాద్, ముఖ్య పరిపాలనా అధికారి షితాన్షు కుమార్ నేతృత్వంలో సిబ్బంది సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి డా. డి. కృష్ణవేణి ఈ వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించి, వారమంతా నిర్వహించనున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. “సమృద్ధి కోసం నైతికత” అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలు ప్రభుత్వ సేవల్లో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. సిబ్బంది నిజాయితీని పాటిస్తూ, అవినీతి రహిత పని వాతావరణాన్ని పెంపొందించి, ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నైతిక విలువలు, సమగ్రత, సుపరిపాలన పట్ల ఐసీఏఆర్--ఐఐఆర్ఆర్ తన నిబద్ధతను చాటిచెప్పింది.



నేడు శంషాబాద్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండే ప్రాంతాలు

శంషాబాద్, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం)

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా తెలిపారు. సెక్షన్ పరిధిలో 11:00 నుండి 13:00 వరకు ఆదర్శ్ నగర్ ఫీడర్,14:00 నుండి 16:00 వరకు నర్కుడ ఏ జి ఎల్ ఫీడర్‌లలో రోడ్డు విస్తరణ , వార్షిక నిర్వహణ పనుల కారణంగా 11:00 నుండి 13:00 ఆదర్శ్ నగర్, రామ్‌రాజ్ షో రూమ్, శ్రీనివాస కాలనీ, సిద్ధేశ్వర్ కాలనీ, పాత రిజిస్ట్రేషన్ ఆఫీస్ మెయిన్ రోడ్ 14:00 నుండి 16:00 వరకు నార్కుడ, కవ్వగూడ, అమ్మిల్లి, చోదేర్‌గూడ, సుల్తాన్‌పల్లి, బ్యూటీ గ్రీన్ ప్రాంతాలలో ఉంది సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

బండ్లగూడలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

నిద్రపోయిన యువకుడు ఎంతకీ లేవకపోవడంతో ఆసుపత్రికి తరలింపు

బుద్వేల్, అక్టోబరు 26 (ప్రభాత ఉదయం) :



శ్రీవాస్తవ్

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో నివాసం ఉండే శ్రీ వాస్తవ్ (24) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీ వాస్తవ్, సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఉద్యోగానికి వెళ్లనని చెప్పి నిద్రపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడి అక్క, బావ ఎంతసేపటికీ లేవకపోవడంతో నిద్రలేపేందుకు ప్రయత్నించారు. స్పందించకపోవడంతో ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడితో పాటు అతడి అక్క, బావ కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




బుద్వేల్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, ఎస్ ఈ నరేందర్ గౌడ్ లు

బుద్వేల్‌లో రూ.1.05 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు

శంకుస్థాపన చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, అక్టోబరు 26 (ప్రభాత ఉదయం) :

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గ్రీన్‌సిటీ కాలనీ, బుద్వేల్ ప్రాంతంలో రూ. 1.05 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. రాజేంద్రనగర్ ఎస్ ఈ నరేందర్ గౌడ్ తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లను వేస్తున్నామన్నారు. సీ సీ రోడ్ల నాణ్యతగా వేసేటట్లు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాలలో వేస్తున్న రోడ్ల నాణ్యత పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మీ గూడలో కరెంటు స్తంభాన్ని ఢీ కొని నుజ్జునుజ్జు అయిన కారు ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు గాయ పడ్డారు.
- బుద్వేల్, ప్రభాత ఉదయం

శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్





10తులాల బంగారం, 1 కేజీ వెండి రికవరీ

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం)

శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే తాళం వేసిన ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించారు. నిందితుడి నుంచి 10 తులాల బంగారం, 1 కేజీ వెండి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం శాంతినగర్ పోలీస్ స్టేషన్ లో గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య వివరాలు వెల్లడించారు.ఈ నెల 14వ తేదీన వడ్డేపల్లి మండలం శాంతినగర్ ఇందిరానగర్ కాలనీకి చెందిన రైతు తోట మాధవరావు ఇంట్లో చోరీ జరిగింది. సుమారు 20 తులాల బంగారం, 1కేజీ వెండి చోరీకి గురైంది. బాధితుని ఫిర్యాదు మేరకు శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానంతో గురువారం తెల్లవారుజామున శాంతినగర్ లో అనుమానస్పదంగా తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. కమ్మంచెట్ల వీధి, కళ్యాణదుర్గం పట్టణం, అనంతపురం జిల్లా (ఆంధ్రప్రదేశ్) కి చెందిన పిట్ల గంగాధర అలియాస్ వడ్డే పీట్ల గంగాధర్ గా గుర్తించారు. బాధితుని ఇంట్లో చోరీకి గురైన మొత్తం 20 తులాల బంగారం, 1 కేజీ వెండి ఆభరణాలలో ఇప్పటి వరకు 10 తులాల బంగారం, 1 కేజీ వెండిని పోలీసులు రికవరీ చేశారు. మిగిలిన 10 తులాల బంగారాన్ని నిందితుడు వివిధ బ్యాంకులలో తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ పొందినట్లు విచారణలో అంగీకరించాడని, ఆ ఆభరణాలను కూడా త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన పి. గంగాధర నేర చరిత్ర కలిగిన అలవాటు నేరస్తుడు అని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక రాష్ట్రాల్లో ఇతనిపై మొత్తం 43 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ సీఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు - ఎన్ఎస్‌యుఐ హెచ్చరిక

భాషిత జూనియర్ కళాశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

ఎన్ ఎస్ యు ఐ డిమాండ్

స్పందించకపోతే డీఐఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన - జిల్లా విద్యాధికారికి వినతిపత్రం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



చింతల్, ఐడిపిఎల్ లో ఉన్న భాషిత జూనియర్ కళాశాలపై తక్షణమే విచారణ జరిపి నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ ఎస్ యు ఐ జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకుడు గోల్ల జాన్ కలిసి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ నాయకులు కూర్చొని ధర్నా నిర్వహిస్తూ కళాశాల వ్యవహారంపై తమ నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నిర్వహణ జరుగుతున్నట్లు తేలితే కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో డీఐఈఓ కార్యాలయం ఎదుట, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఎన్ ఎస్ యు ఐ చూస్తూ ఊరుకోదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్26(ప్రభాత ఉదయం):

గద్వాల మండలం కొండపల్లి రోడ్డులో గల "హరిత కాటన్ ఇండస్ట్రీస్" మిల్లులో గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2026-27 ఖరీఫ్ సీజన్ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సీసీఐ ఇన్చార్జ్ రాహుల్ ప్రారంభించారు. పత్తిలో తేమ శాతం 8% కంటే తక్కువగా ఉన్నట్లయితే ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,667 లభిస్తుందని గద్వాల మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి యు. ఎల్లస్వామి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిల్లు యాజమాన్యం, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో కోట్ల రూపాయలు వ్యర్థం, అభివృద్ధి శూన్యం

బిజెపి యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్

కూకట్ పల్లి, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)



శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ బిజెపి అధ్యక్షులు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ లో ఉన్న హిందూ స్మశాన వాటిక, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిజెపి యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి సిఎంని ఆల్విన్ కాలనీ (51) సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ని కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ స్మశాన వాటిక సమస్య ఏండ్ల తరబడి ఉన్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. కోట్ల రూపాయలు అభివృద్ధి పేరిట వచ్చినా పంచుకోవడమే తప్ప ప్రజలకు స్మశాన వాటికను అందుబాటులోకి తీసుకురాలేదు అన్నారు. ఎల్లమ్మబండ ప్రాంతంలో ఎవరు మరణించిన కిలోమీటర్ల దూరం తీసుకెళ్లే దుస్థితి, చివాట్లతో దహన సంస్కారాలు చేసుకునే దుస్థితి ఉంది అన్నారు. అందుబాటులో స్మశాన వాటిక ఉన్న అభివృద్ధికి నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్న వ్యవస్థలో మార్పు లేకపోవడం దుర్మార్గమైనది అన్నారు. ఇప్పటికైనా వెంటనే పూర్తి మరమ్మత్తులు చేసి స్మశాన వాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. లేనిపక్షంలో స్మశాన వాటికలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తాం అన్నారు. అలాగే డివిజన్లో రోడ్ల సమస్యలు కూడా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా నాయకురాలు జ్యోతి, డివిజన్ బిజెపి నాయకులు రమేష్, కమల్, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మండల ప్రజావాణికి ఫిర్యాదులు కరవు!

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం):

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పిర్యాదులు కరవయ్యాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏ మాత్రం ఫిర్యాదులు అందలేదు. అయితే గత మూడు నెలల నుంచి నిర్వహించిన ప్రజావాణికి కేవలం 28 ఫిర్యాదులే అందాయి. దీనిపై ఎంపీఓ పద్మావతి మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని, ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ అజిత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ జెడ్పీటిసి పద్మ వెంకటేశ్వర్ రెడ్డి







గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

ధరూర్ మండలం పెద్దపాడు,ధ్యాగదొడ్డి, చిన్నపాడు,అల్లాపాడు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని, మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాల్మీకి కమిటీ సభ్యులు ఆమెను శాలువాలతో సత్కరించారు.అనంతరం ధ్యాగదొడ్డి గ్రామంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి విశేష సేవ చేసిన వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. వాల్మీకి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,వాల్మీకి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా అశ్వినీ శుక్ల పౌర్ణమి యజ్ఞం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం):

కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అశ్వినీ శుక్ల పౌర్ణమి సందర్భంగా యజ్ఞ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ భగవంతుని ఆశీస్సులు పొందుతూ, లోకకల్యాణం, సమాజ శ్రేయస్సు, విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ప్రార్థించారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సద్గుణాలు, క్రమశిక్షణ, సంస్కారాలను పెంపొందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ , గట్టు శ్రీనివాస్ కొత్తూరు ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళ దేవి,పాల్గొన్నారని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలియజేశారు.



బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం):

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల పి .లక్ష్మణాచారి అన్నారు. బాలల రక్షణ, బాలలపై లైంగిక నేరాలను నిరోధించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ "సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ పిల్లలకు తమ హక్కుల గురించి, మంచి స్పర్శ--చెడు స్పర్శ గురించి, అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తుల నుంచి ఎదురయ్యే ప్రమాదాల గురించి వయస్సుకు తగిన రీతిలో అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో చట్టంలోని నిబంధనలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలలు విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా, పిల్లల భద్రతకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.సుష్మిత, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జగన్ మోహన్ రావు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం):



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం అక్టోబర్ 25న హైదరాబాద్‌లోని కోఠి ఐఎంఏ భవనంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కరీంనగర్ ఐఎంఏ శాఖకు చెందిన డాక్టర్ జగన్ మోహన్ రావు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన ప్రత్యర్థిపై గణనీ యమైన ఆధిక్యంతో విజయం సాధించారు. అదే శాఖకు చెందిన డాక్టర్ పొలాస రామ్ కిరణ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాష్ట్ర కార్య వర్గంలోని ఇతర పదవులకు డాక్టర్ కె. శ్యామ్ సుందర్, డాక్టర్ కె. రాజేశ్వర్, డాక్టర్ ఎం.ఎల్.ఎన్. రెడ్డి, డాక్టర్ అలీమ్, డాక్టర్ జి. వెంకట రెడ్డి, డాక్టర్ ఎ. శైలజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైద్యరంగానికి చెందిన ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తి సంఘాల ప్రతినిధులు,



దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి

ప్రశాంత్ నగర్ డివిజన్ లో బీజేపీలో చేరిన యువత

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన నాయకులు

కూకట్ పల్లి, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

ప్రశాంత్ నగర్ డివిజన్ పరిధిలోని ఏవీబీపురానికి చెందిన పలువురు యువకులు యువ నాయకులు కార్తీక్, లక్ష్మణరావు నాయకత్వంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్ చార్జ్ మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కేంద్ర ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై యువకులు బీజేపీలో చేరినట్లు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ యువత పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీజేపీలో చేరడం సంతోషకరమని, దేశాభివృద్ధి మరియు ప్రజాసేవలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన యువకులకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేయాలి: ఎమ్మెల్యే జియంఆర్





కొత్త కోట, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం)

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై మొగ్గు చూపాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ కోరారు.కొత్తకోట మండలం పాలెం గ్రామంలో రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. వేరుశనగ విత్తనాల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తోందని తెలిపారు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం కొత్తకోట పట్టణంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జియంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి, కనీస మద్దతు ధర పొందాలని సూచించారు.ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,461 కనీస మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.అలాగే ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ పొందాలన్నారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.తదనంతరం కొత్తకోట చౌరస్తాలో మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తరపున ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే జియంఆర్ ప్రారంభించారు.అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ఈ సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు.పట్టభద్రులందరికీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన పట్టాభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.



కేటిదొడ్డి మండల కేంద్రంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం):

కేటిదొడ్డి మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేటిదొడ్డి మండలం వాల్మీకి సేవాసమితి మండల ఉపాధ్యక్షుడు జంగిలప్ప, రవిబాబు ఆధ్వర్యంలో వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణం రచయితగా మొదటి ఇతిహాస కావ్యాన్ని రూపొందించిన మహనీయుడని కొనియాడారు. రామాయణం రచించి ప్రపంచానికి తెలియజేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అంటూ ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ వీరన్న గౌడ్, ఏఈఓ ప్రవళిక, వాల్మీకి నాయకులు కిష్టప్ప, కొండన్న, తయాప్ప, కిష్టప్ప, వీరన్న, గోపాల్, కొండయ్య, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.40 కోట్ల బిల్లుల కోసం అమర నిరాహార దీక్షకు సిద్ధం

నా ప్రాణం విలువనా... రూ.40 కోట్లు విలువనా ప్రభుత్వమే తేల్చాలి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

రోడ్ల పనులు పూర్తి చేయకుంటే 30 వేల మందితో కలిసి దీక్షకు దిగుతా:జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల,అక్టోబర్ 26,(ప్రభాత ఉదయం)



కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరుపై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో రోడ్ల పనులు పూర్తి చేసేందుకు నిధులు, బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.రోడ్ల నిర్మాణానికి సంబంధించిన సుమారు రూ.40 కోట్ల బిల్లుల విషయంలో ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లులు మంజూరు చేయకపోతే తన ప్రాణాలను సైతం పణంగా పెట్టేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. తన ప్రాణానికి విలువ ఇస్తారా, రూ.40 కోట్లకే విలువ ఇస్తారా అనేది ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు.తన నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

నా చావుతోనే స్పందిస్తారా?

ప్రజలకు ఉపయోగపడే రోడ్ల నిర్మాణ పనుల బిల్లుల కోసం ఇంతటి ఒత్తిడి ఎదుర్కోవాల్సి రావడంపై అనిరుధ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తన ప్రాణాలను పణంగా పెడితేనే ప్రభుత్వం స్పందిస్తుందా అంటూ ప్రశ్నించారు. సొంత ప్రభుత్వంలోనే అభివృద్ధి పనుల బిల్లుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు, పనుల పూర్తి విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, కుల ధ్రువీకరణ పత్రాలపై అధికారులతో చర్చ

లంగర్ హౌస్, అక్టోబర్ 26(ప్రభాత ఉదయం)



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాల జారీపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు సంబంధిత అధికారులతో చర్చించారు. ఎంఆర్‌పీఎస్ నూతన అధ్యక్షుడు భోగి శివకుమార్, మహాజన సోషలిస్టు పార్టీ ఇబ్రహీంబాగ్ డివిజన్ నూతన అధ్యక్షుడు భోగి నరేందర్, సీనియర్ నాయకుడు భోగి దేవరాజ్, మాజీ అధ్యక్షుడు మాసూరి జగన్, బస్తీ సలహాదారులు భోగి విజయానంద్, డి. శ్రీకాంత్ కలిసి లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ సీఐ బి. వెంకట్ రాములు, గోల్కొండ తహసీల్దార్ (ఎంఆర్ఓ) ఎన్. సునీతను కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను సులభతరం చేసి, వారు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.



పట్టుభద్రుల ఓటర్ నమోదును వేగవంతం చేయాలి

దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్త కోట, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేయించేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండల కేంద్రంలో మహబూబ్ నగర్ - హైదరాబాద్ - రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ. మహబూబ్ నగర్, హైదరాబాద్, రంగారెడ్డి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుదారులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించాలని పార్టీ నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని, ప్రజాస్వామ్యం ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, పట్టభద్రులందరినీ గుర్తించి, గ్రామ, వార్డు స్థాయిల్లో సమన్వయంతో పనిచేస్తూ వందశాతం నమోదు పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులు పాల్గొన్నారు.



ఫతేనగర్ చిరు వ్యాపారులకు బండి రమేష్ అండ

బాలానగర్, అక్టోబర్ 26 (ప్రభాత ఉదయం)

కూకట్ పల్లి నియోజకవర్గ, ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద గత 30 ఏళ్లుగా బడ్డీ కొట్లు, పాన్ డబ్బాలు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న నిరుపేదలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అండగా నిలిచారు. చిరు వ్యాపారులను దుకాణాలు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో వారి సమస్యలను తెలుసుకున్న బండి రమేష్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు క్రాంతి ముదిరాజ్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, నిరుపేద కుటుంబాల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని, సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూరజ్ తివారి, క్రాంతి, కిట్టు, రాము, నర్సింగ్, ఇజాజ్, రమణ, వినయ్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం):

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచ్ పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ హైస్కూల్ (బాలికల)లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 31 వరకు పోక్సో చట్టం పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 18 సం.ల లోపు బాల బాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని, చట్టంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా బాల బాలికలకు రక్షణ ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల వలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, స్కూల్ ప్రిన్సిపాల్ దివాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



గణిత శాస్త్రంలో ప్రతిభను చాటిన ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్26(ప్రభాత ఉదయం)

జాతీయ స్థాయిలో నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రీజినల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్' కు ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇది వారి అసాధారణ గణిత నైపుణ్యాలకు, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తికి సమస్యలను పరిష్కరించగల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.ఈ ప్రతిష్టాత్మక ఒలింపియాడ్‌కు ఎంపికైన వారిలో బొనగంటి అకృతి, చి. వెంకట మోక్షిత్, జీరెడ్డి నక్షత్ర, వి. యువన్‌రెడ్డి ,సహస్ర రెడ్డి.ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయస్సు నుండే గణితంపై ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, అలాగే క్లిష్టమైన సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఆల్ఫోర్స్ విద్యా విధానంలో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు."ఆల్ఫోర్స్ విద్యార్థులు జాతీయ స్థాయి వేదికలపై తమ మేధస్సును నిరూపించుకోవడం గర్వకారణం. ఈ ఎంపిక విద్యార్థుల కఠోర శ్రమకు ఉపాధ్యాయులు అందించిన సమర్థవంతమైన శిక్షణకు ప్రతిబింబం. వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, జాతీయ అంతర్జాతీయ వేదికలపై విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను" అని ఆయన అన్నారు. రీజినల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులకు మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.విజేతలందరికీ ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి, భవిష్యత్తులో వారు మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయంలో కృషి చేసిన సిబ్బందికి కూడా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608